# చిలుక పలికింది

పుష్పమ్మ మాట్లాడ్డం మానేసింది. అంటే మాట పడిపోయింది. ముందు జ్వరం వచ్చింది. ఆ తర్వాత గొంతు బొంగురు పోయింది. లోపల నుంచి ధ్వని రావటం మానేసింది. మూడో రోజుకి రహస్యంగా కూడా ఏమీ అనలేని స్థితి వచ్చేసింది.

పుష్పమ్మ పల్లెటూరి నుంచి పట్నం వచ్చి నాలుగేళ్లయింది. ఆమె మొగుడు శీను ఒక బంగళాలో వాచ్‌మెన్‌గా చేరాడు. భార్యని తీసుకు వచ్చి ఔట్‌హౌస్‌లో కాపురం పెట్టాడు. ఆమె ఆ బంగళాలోనే కాక మరొకరి ఇంట్లో కూడా పని చేస్తోంది. ఎంతో శుభ్రంగా, వళ్లు దాచుకోకుండా పనిచేస్తుంది. కనుక ఈ రెండిళ్లకీ ఆమె అభిమాన పాత్రురాలైంది. హఠాత్తుగా ఆమె మాట్లాడ్డం ఎందుకు మానేసిందని రెండిళ్ళ ఇల్లాళ్లు, యజమానులు ఆదుర్దా చెంది, దగ్గు మందులు, గొంతు వాపు తగ్గే మాత్రలు వగైరాలు చాలానే ఇచ్చారు.

మరురోజు, ఇంకో రోజు గడిచినా గానీ ఆమెకి మాట రాలేదు. ఇదేదో సీరియస్ విషయమని బంగళా వారు ఆమెను చెవి, ముక్కు, గొంతు స్పెషలిస్టు దగ్గరికి పంపించారు. పరీక్షలన్నీ చేసి వాళ్ళు నాలుగు మాత్రలిచ్చి మళ్లీ రమ్మన్నారు. మళ్ళీ వెళ్ళినా గానీ వారికి ఏమీ అంతు చిక్కలేదు.

'రక్తహీనత' పరీక్షలు చేయించారు పుష్ప కొలువు చేస్తున్న రెండో ఇంటి వారు. రిపోర్టు బాగానే వుంది. కాస్త ఆగి పెద్ద ఆస్పత్రిలో ఫిజీషియన్ దగ్గరికి పంపారు. ఆయనా ఏవో గోలీలు రాసిచ్చి 'ఎక్సరే' తీయమన్నాడు. ఎక్స్‌రే ఫోటోలు తీసుకుని బంగళా యజమాని ఉపేందర్ క్యాన్సర్ స్పెషలిస్ట్ దగ్గరికెళ్ళాడు. పుష్ప గొంతు నాళాలు బాగానే వున్నాయనీ ఇదేదో సైకాలజీ సంబంధమనీ అన్నాడు.

ఈలోగా ఛాతీ నిపుణుడికి కూడా చూపించడం అయింది. రెండు మూడు వారాల్లో ఈ రెండు ఇళ్లవారికీ నాలుగు వేల రూపాయలు వదిలాయి. కానీ ఫలితం లేదు ఎంత చెప్పినా ఆమె మాట్లాడ్డానికి ప్రయత్నించదు. మాట రావడం లేదని సైగలు చేస్తుంది. వైద్యులంతా చేరి అంటున్న మాట 'ఈమెకేదో' మానసికంగా షాక్ తగిలిందని, మొగుడు శీను తల పట్టుకుని కూర్చున్నాడు. బెంబేలు పడి పోతూ తీసుకుని వెళ్లమన్న చోటుకల్లా వెంటపెట్టుకుని వెళ్లి వస్తున్నాడు.

ఈ పేషెంటుకి పెళ్లయి పదేళ్ళయినా పిల్లలు లేరు. అట్లా లేరని ఎవరో ఆమెను కటువుగా మాటలు అని వుంటారు. లేదా ఆమె మొగుడు కొట్టి హింసలు పెట్టి వుంటాడు. సరిగా విచారించండి, అని ఒక డాక్టరుగారి సలహా. బంగళా యజమానురాలు లలితాంబతో ప్రత్యేకంగా కూచుని చాలాసేపు మాట్లాడాడు ఆ డాక్టరు.

'అమ్మా! మీరు పెద్దవారు. పిన్నలు పడే గొడవలు బాగా అర్థమౌతాయి. ఈ పనిమనిషిని, "మీరు బిడ్డలాగా చూసుకుంటున్నారు. కనుక బుజ్జగించి అడగండి మొగుడితో ఏమి తగాదా పడిందో! పిల్లలు లేకపోతే జీవితం ముగిసిపోదు వైద్యం చేయించుకోవచ్చు. లేదా ఎవరినైనా పెంచుకోవచ్చు అని నచ్చ చెప్పండి" అంటూ సుదీర్ఘమైన సలహా యిచ్చాడు.

లలితాంబ ఆ ప్రయత్నాలు ఎంతో నిజాయితీగా చేసింది. కానీ పుష్పకి మాట రాలేదు. పుష్పమ్మ భర్తని నీవేమైనా తిట్టావా, కొట్టావా అని ప్రశ్నించింది లలితాంబ. 'రామ రామ, నేనెందుకు కొడతానండీ, నేనెందుకు తిడతానండీ!' అంటూ శీను నెత్తి బాదుకున్నాడు. పుష్ప గుడ్లు వప్పగించి చూస్తుంది. కానీ అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పదు.

ఈలోగా ఆరు నెలలు గడిచాయి. డాక్టర్ల చుట్టూ తిరగలేక పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు పెట్టలేక అందరూ వెనక్కి తగ్గారు. సైక్రియాట్రిస్టు అంటే మాటలా? ప్రతిసారీ వందలకు వందలు యివ్వాలి. ఎవరు అంత డబ్బు పెట్టాలి అని ఆ వైద్యం వాయిదా వేశారు.ఏదో పసరు వైద్యానికని పల్లెకు పోయి వచ్చింది పుష్పమ్మ.

ఒక రోజున శీనుకి వాళ్ల వూరి నుండి ఫోన్ వచ్చింది. గ్రామపంచాయితీ ఎన్నికలు వస్తున్నాయనీ, వాళ్ల ఊరు మహిళా సీటు కనుక పుష్పమ్మని నిలబెట్టమనీ, ఊరు నాయకుడు ఫోన్ చేశాడు. శీను వాళ్లతో ఫోనులో చాలా సేపు మాట్లాడాడు.

వెంటనే పుష్పని తీసుకుని బయలుదేరి వెళ్ళి నామినేషను పడేసి రావాలని నిశ్చయించుకున్నాడు. లలితాంబ, ఇంట్లోనివాళ్ళందరూ కూడా ఆశ్చర్యపోయారు. వాళ్లకి నవ్వొచ్చింది. బాసన్లు తోముకునే ఈ పుష్పమ్మ సర్పంచు ఏమిటని? "నీ మొహం. సర్పంచి పని నీకెల్లా వస్తుందే!" అని ముఖాన అనేశారు కూడా.

పుష్పమ్మ ఒక కాగితం, పెన్సిలు వెతికి తీసుకుని తన సంతకం తెలుగులో చేసి చూపించింది. అంటే ఆమెకు కూడా తను ఎన్నికల్లో పోటీ చేసి నెగ్గి, సర్పంచు కాగలనని ధీమా ఉన్నదన్నమాట.

ఎన్నికలంటే తేలిగ్గా లేవు. ఎంత డబ్బు కావాలి. ఎన్ని రోజులు ప్రచారం చేస్తూ అక్కడే వుండిపోవాలి! పుష్ప సిటీ వదిలి పల్లెటూరికి వెళ్లిపోతుందా? ఆమె చేస్తున్న రెండు ఇళ్లవాళ్లకీ ఆమె వెళ్ళడం యిష్టం లేదు. కానీ ఆమె తన మూగ భాషలోనే బతిమాలింది. కాగితం పడేసి రెండు రోజులకి వస్తానన్నది.

'ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చింది' అనే సామెత చాలా సార్లు గుర్తుకొచ్చింది లలితాంబకి. నోరులేని, ఈ చదువురాని మనిషికి పదవి మీద ఎంత కోరిక అనుకుంది.

మూడో రోజున శీను ఊరి నుంచి ఫోన్ చేశాడు. "ఈడ మనం నెగ్గేట్లు లేదండీ. లచ్చరూపాయలైన కావాలని అంటున్నారు. పొలం బ్యారం పెట్టి తీస్కొందామంటే యీమె వప్పుతలేదు" అని చెప్పాడు.

"పోరా! ఇళ్లు, పొలాలు అమ్ముకుని ఎన్నికలలో తగులబెట్టేందుకు నువ్వేమైనా జాగిర్దారువా? రాత్రికి వచ్చేయండి" అని లలితాంబ గట్టిగా చెప్పింది. ముందే అనుకుంది ఆమె ఈ కటిక పేదవారికి పదవులు ఏమిటి అని. ఎవరో పెద్ద సేఠ్‌లు, మోతుబరి రైతులు ఆడవలసిన ఎన్నికల ఆటలో, ఈ వెర్రి మనుషులు ఏమిటి అని.

అట్లా పోయిన శీను, పుష్పమ్మ నెలాఖరుకి గానీ తిరిగి రాలేదు. పనిమనిషి లేక, ఎవరినీ పెట్టుకోక ఈ ఇళ్ళవాళ్లు చాలా చిక్కులు పడ్డారు. మధ్యాహ్నం పూట ఎండ మండిపోతున్న సమయంలో ఇంటి ముందు ఆటో ఆగిన చప్పుడైంది. బద్ధకంగా పేపరు తిరగేస్తున్న లలితాంబ కళ్లజోడు తీసి బయటకు చూసింది. గేటు తీసుకుని శీను, పుష్ప వస్తున్నారు. అతని చేతుల్లో ఒక సూట్‌కేసు, బ్యాగు ఆమె చేతులూపుకుంటూ చకచకా లోపలికి వచ్చింది.

చెప్పులు వదిలి, లలితాంబ కాళ్లకి దణ్ణం పెట్టింది. "అమ్మా! నేను సర్పంచ్‌ని" అన్నది.

లలితాంబ నోరు తెరిచేసింది. "నువ్వు మాట్లాడుతున్నావా? నీకు మాట వచ్చేసిందా? ఎల్లాగ?" అంటూ శీను వంక చూసింది. సూట్‌కేసు కింద పెట్టి అతను కూడా అమ్మగారి ముందు సాగిల పడ్డాడు.

"ఔనమ్మగారూ! ఏక దమ్మున మాట వచ్చింది" అన్నాడు.

లలితాంబ ఆశ్చర్యంతో ఈ అద్భుతాన్ని తట్టుకోలేకపోతోంది. ఎన్నికల కథ అంతా చెప్పుకొచ్చాడు శీను. పొలం బేరం పెడితే పుష్ప వప్పుకోలేదు. నేను సర్పంచిని కాను సరికదా వున్న భూమి పోతుందని గొడవ పెట్టింది. పెళ్లానికి ఎలాగైనా పదవి కట్టబెడితే, ఊళ్లో తన పరువు పెరుగుతుందని శీను ఆలోచించినట్లున్నాడు. అమ్మి తీరుతానని, లేదా తనఖా పెట్టి అయినా డబ్బు తెస్తానని పేచీ పెట్టాడు.

ఆ దెబ్బలాట సమయంలో ఆమె ఒక్క అరుపు అరచిందట. నిర్ఘాంతపోయినాడు శీను. ఊరి మొత్తం ఆశ్చర్యపోయారు. కానీ అంతే మళ్లీ ధ్వని రాలేదు. ఏదో పొరపాటు విన్నాంలే అనుకున్నారట.

"సరేలే! అసలు మళ్లీ ఏం జరిగిందో చెప్పు. ఒరేయి శీను. నా దగ్గర అబద్ధాలాడకు. డాక్టరుగారు నాకు అంతా చెప్పారు. నీ వల్లనే దానికి మాట పడిపోయిందని పెద్ద డాక్టర్లంతా చెప్పిన మాటలే" అని శీను కథనానికి అడ్డుకట్ట వేసింది లలితాంబ.

"అదేనమ్మా, సెబుతుంటి గదా? ఆ పార్టీ, ఈ పార్టీల వాళ్లంతా గుమిగూడిండ్రు. అది ఎస్సీ సీటాయె. లేడీస్ సీటు. సంతకం పెట్టడం వచ్చినామె ఈమె ఒక్కర్తె నన్నమాట. ఇహ మనూళ్లో మనకి గొడవలు దేనికిలే అనుకున్నారో ఏమో! ఏకగ్రీవంగా అంతా చేరి, ఈమెకే ఖరారు చేసిండ్రు. పోటీ లేదు. ఏమీ లేదు" అని కథ ముగించాడు.

ఏకగ్రీవంగా అబ్బా ఊరి మొత్తానికి అందరూ పుష్పని వరించారన్నమాట! "అది సరే గానీ అసలు ముచ్చట చెప్పవేంరా? మాట ఎలా వచ్చింది అని" అన్నది లలితాంబ.

శీను బుర్ర గోక్కున్నాడు. "అదాండీ అమ్మగోరు! మొదటి నాడు మీటింగైంది. పదవీశీకారం అన్నమాట.

ఆడవాళ్ళంతా బయట నిలబడ్డరు. ఆడ ఆఫీసులో రెండే కురిసీలుండాయి. అందరూ సాపల మీద కూచోవాలి.

ఆఫీసరు వచ్చిండు. నేను పోయి 'నమస్తే సార్' అన్నాను. పుష్పమ్మ కూడా గుమ్మం కాడనే నిలబడి వుండే. ఈమె నా సర్పంచ్ అన్నాడు లోపలకు వస్తూనే. 'ఆమెనే! సంతకం ఏడ పెట్టాలి' అన్నాను. ఆమె సరింగ పెడుతుందో పెట్టదోనని నాకు ఫికరు కదా! ఆయన లోపల పోతుంటే నేనూ పోయిన. ఆయన ఒక కుర్చీలో కూర్చుండగానే, నేను ఇంకో కుర్చీలో కూకున్న.

గుమ్మం కాడ నిలబడ్డ పుష్పమ్మ సర్రుమంటు లోపలికొచ్చి కుర్చీలోంచి 'లెగు' అన్నట్లు నా వంక చూసి సైగ చేసింది. నేను యినిపించుకోక షర్టు కాలరు యిట్ల అనుకుంటా ఆఫీసరుతో మాట్లాడుతున్నాను. రెండు మార్లు ఆమె నా చేయి పట్టి గుంజింది. నాకు బలే కోపమొచ్చి లేచి, సెంప మీద ఒక్క దెబ్బతీసినా. ఆడమనిషి నా భార్య నలుగురిలో నన్ను లేవమంటే, నేనెందుకు లేవాలి అంటూ పుష్పవంక చూశాడు.

"ఔనమ్మగోరు! అంత పబ్లీకులో నన్ను కొడితే గట్టిగ రెక్క పట్టుకొన్న. నేనే ఒక్కటి ఏస్తుంటి గానీ కుర్చీ వదిలి నిలబడ్డాడు. "ఏయ్ శీనయ్యా! ఈకుర్చీ నాది. నేనయ్యా సర్పంచిని. నీవుగాదు. నేను ఏకగ్రీవంగా ఎన్నికైనాను లేలే' అన్నాను. ఆ మాట ఎట్లా వచ్చిందో నాకైతే తెలవదు." స్పష్టంగా, చిలుకలా, బలంగా గొప్పనాదంతో పుష్ప నోట్లోంచి వస్తున్న ఆ మాటలు, లలితమ్మను ఎంతో సంతోషంలో ముంచేశాయి.

తన కన్నబిడ్డల పలుకులకు పంచదార చిలుకలు పంచాలన్నంత సంబరమైంది.

కొద్ది నాళ్ళకే సర్పంచి పుష్పమ్మ తనమొగుడు శీనుని వెంటబెట్టుకుని గ్రామానికి తరలిపోయింది. ఈలోగానే తనకి మాట పోయినప్పుడు, ముందుగా ఏం జరిగిందో చెప్పింది. 'నీకు పిల్లలు కాలేదు ఇంకో పెళ్ళాన్ని కట్టుకుంటానని ఆరాత్రంతా సతాయించాడట శీను. ఎంతో సేపు ఏడిచి, ఏడిచి ఆమె గొంతు పూడుకుపోయింది. నిజంగానే తనని వదిలేస్తాడన్న భయంతో ఆమె మాట పడిపోయింది. 'ఔరా! డాక్టర్లు చెప్పింది నిజమే సుమా! సర్పంచిగా ఎన్నికైనాక ఆమెకు వచ్చిన కొత్త విశ్వాసంతో ఆమెకు మాటలు వచ్చాయి' అని శాస్త్రీయంగా అర్థం చెప్పింది లలితాంబ. శీను మాత్రం తాను సర్పంచిని కాకపోయినా సర్పంచి మొగుడినని కాలరు ఎగరేస్తున్నాడని వేరే చెప్పాలా? ఎందుకంటే పుష్పమ్మకి నెల తప్పింది కూడా!

– నది

ఏప్రిల్, **2009**